## మినీకథ

# భర్తల దౌర్జన్యం నశించాలి

తెన్నేటి సుధ



విశాలాక్షికి కడుపులో మండిపోతోంది. ఒళ్ళంతా వాతలు తేలినయ్యేమో ఒళ్ళు కూడా భగభగ మండిపోతోంది. పొద్దుట్నించీ కన్నీళ్ళతోనే 'భర్తల దౌర్జన్యం నశించాలి' అని మనసులోనే నినాదాలిస్తోంది హఠాత్తుగా ఒక ఐడియా వచ్చింది— దాంతో ఆవేశంకూడావచ్చింది 'ఇట్లా లాభం లేదు. భర్తలందరికీ బుద్ధి రావాలంటే కలం పట్టాలి—అవును కలం పట్టాలి' అనుకుంది విశాలాక్షి దీక్షబూనినట్లు. కలంపట్టే బుద్ధెలా వస్తుందన్న అనుమానమొసే మరి కలమే కదా చైతన్య వాహిక. ఏ చైతన్యం రావాలన్నా పత్రికామాధ్యంలో కలం ద్వారా రావాల్సిందే కదా!

కానీ వచ్చిన చిక్కల్లా విశాలాక్షి ఇంతకు ముందెప్పుడూ కలం పట్టలేదు. అంటే స్కూల్లో చదవలేదు. రాయలేదు అనికాదు- ఆ మాటకొస్తే కాలేజీ కూడా చదివింది.

ఎటొచ్చీ రచనలు చేయడానికి కలం పట్టలేదు. కానీ ఇప్పుడు విశాలాక్షికి ఆవేదనలోంచి ఆవేశం వచ్చింది. దుర్మార్గులైన భర్తలందరిమీదా కోపం వచ్చింది. పెట్టె అడుగున పడివున్న పెన్నుతీసి. పాళీ సరిచేసి. ఇంకు పోసింది. తెల్ల కాగితాల మీద భర్తల నిరంకుశత్వాన్ని దుయ్యబట్టింది. ఓపికున్నంతవరకూ తిట్టింది. భర్తలమీద భార్యలందరూ తిరగబడాల్సిందే. దౌర్జన్యం సహించకూడదంటూ ఢంకా బజాయించినట్లు చెప్పింది. వ్రాయడం పూర్తయ్యాక చదివిచూస్తే ఏకబిగిన ఐదారు పేజీల తిట్లు. కసిగా నవ్వుకుంది. ఇది ఏదైనా పత్రికకు పంపించాలి. అంటే ఇన్నితిట్లు తిట్టే బాగుండదేమో- అన్న అనుమానం వచ్చి అందులోంచి కొన్ని తిట్లు తగ్గించి మళ్ళీ వ్రాసింది విశాలాక్షి 'భర్తల దౌర్జన్యం నశించాలి' అన్న శీర్షిక వ్రాసి తన అభిమాన స్త్రీల పత్రికకు పోస్టుచేసి. తృప్తిగా నిట్టూర్చింది.

తాగి వచ్చినప్పుడు తప్ప విశాలాక్షి మొగుడు మంచివాడే పాపం సంవత్సరానికో సినిమాకి తీసుకెళ్తాడు కూడా. కానీ వచ్చిన గొడవల్లా రోజూ చుక్కేసుకొందే ఇంటికి రాడు. ప్రతి రెండు రోజులకోసారి కారణమున్నా లేకపోయినా భార్యని చితక్కొట్టడం అతని హాబీ అందుకే ప్రతి రెండు రోజులకూ భర్తమీద కోపం ప్రజ్వరిల్లుతూనే వుంటుంది విశాలాక్షికి.

* * *

ఆ రోజు ఉదయం పోస్టువాడు పోస్టులో రెండు ఉత్తరాలతోపాటు ఒక పత్రిక కూడా పడేసి పోయాడు- ఆ సమయంలో విశాలాక్షి మొగుడికి అన్నం వడ్డిస్తోంది. పోస్టువాడిచ్చిన పత్రికను కళ్ళు విశాలం చేసి పేజీలు తిరగేస్తోంది విశాలాక్షి ఒక చోట ఆగిపోయింది. ఆశ్చర్యంగా చూసింది 'భర్తల దౌర్జన్యం నశించాలి'- అనే శీర్షికతో వ్యాసం. కింద ముచ్చటగా అచ్చులో విశాలాక్షి పేరు.... కలా. నిజమా అని కళ్ళు నులుముకొని మరీ చూసింది- వచ్చి నిజం!

భోజనం ముగించి చెయ్యికడుక్కొచ్చిన విశాలాక్షి పతిదేవుడు ఆమె చేతిలో పుస్తకం గుంజుకున్నాడు దురుసుగా. 'ఏమిటిది' అని ప్రశ్నించేలోగానే పెద్ద శీర్షిక. కింద విశాలాక్షి పేరూ కనిపించినై! గబగబ అక్షరాల వెంట అతని కళ్ళు పరుగెత్తినై.

హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి దిమ్మెరపోయి నుంచుంది విశాలాక్షి. అచ్చులో తన వ్యాసం వస్తుందనీ. అది ఇంత హఠాత్తుగా భర్త చేతిలో పడ్తుందనీ ఆమె ఊహించలేదు 'తను రచయిత్రి అయినందుకు భర్త మెచ్చుకుంటాడేమో'. అని ఆలోచించే లోపలే భర్త ఆ పత్రికను విసిరి కొట్టాడు కోపంగా! నేలమీద కాదు- విశాలాక్షి మొహంమీద ఇష్టమొచ్చినట్లు తిట్ల పరంపరతో పాటు ఆమె ఒంటిమీద అతని చేతి వేళ్ళు వాతలుగా తేలుతున్నై "పిచ్చి రాతలు రాస్తావా? ఆడవాళ్ళందర్నీ ఉద్ధరించేందుకు నువ్వు అవతారమెత్తావా? నీలాంటి వాళ్ళకి ఇంత తక్కువ డోసు సరిపోదే - ఇంకాస్త ఘాటుగా అంటించాలి లేకపోతే మొగుళ్ళ దౌర్జన్యానికి ఎదురు తిరగమంటావా? ఏదీ. ఒక్కసారి ఎదురు తిరగవే అప్పుడు చూపిస్తా. నా అసలు తడాఖా .." అంటూనే ఆమెను శక్తి మేరకి కొడ్తున్నాడా పతి దేవుడు. దెబ్బలు ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తూనే నిస్సహాయంగా కొట్టొద్దని ప్రాధేయపడ్తోంది విశాలాక్షి.

"ఇంకెప్పుడన్నా ఇలాంటి పిచ్చి రాతలు రాశావంటే చంపేస్తా" అని ఒక హెచ్చరిక చేసి— ఆ పత్రిక చింపి పారేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు రుసరుసలాడుతూ.

కన్నీళ్ళ మధ్య కూర్చున్న విశాలాక్షిని పత్రికలోని 'రచయిత్రి విశాలాక్షి' జాలిగా చూస్తోంది. 'భర్తల దౌర్జన్యం నశించాలి' అన్న అక్షరాలన్నీ కలిసి ఆమెను పరిహసిస్తున్నాయి.